# సత్యము ఆధారంగా దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 24.04.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

గత ఖుత్బాలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సత్యపు ఉన్నత ప్రమాణాలు, వారి ఉత్తమ ఆదర్శ జీవితం మరియు విశ్వాసులకు వారు చేసిన ఉపదేశాల గురించి ప్రస్తావించడమైనది. ఈ విషయమై నేడు కూడా నేను మరికొన్ని విషయాలు తెలియజేస్తాను. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మనల్ని సత్యపు ఏ ఉన్నత శిఖరాలకు చేర్చాలనుకున్నారో ఒక హదీసులో ఈ విధంగా వివరించబడింది. హఫ్స్ బిన్ ఆసిమ్ (రజి) కథనం ప్రకారం ఒక వ్యక్తి అబద్ధాలకోరని చెప్పడానికి, అతను విన్న ప్రతి విషయాన్ని (నిజానిజాలు తెలుసుకోకుండా) ఇతరులకు ప్రచారం చేయడమే సరిపోతుందని మహా ప్రవక్త (స) ఉపదేశించారు. సాధారణంగా ప్రజల్లో ఈ అలవాటు ఎక్కువగా కనిపిస్తుంది. మన సంఘంలో కూడా కొందరిలో ఈ చెడు అలవాటు చాలా ఎక్కువగా ఉంది.

హజ్రత్ ఆయిషా (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులకు అబద్ధం కంటే అసహ్యకరమైన లక్షణం మరొకటి లేదు. ఎవరైనా దైవ ప్రవక్త (అ) సమక్షంలో అబద్ధం చెబితే అది వారి మనస్సులో ఎంతో వేదనను కలిగించేది. ఆ వ్యక్తి తన తప్పును తెలుసుకొని, పశ్చాత్తాపం చెంది తనను తాను సంస్కరించుకొని అబద్ధాలు చెప్పడం పూర్తిగా మానుకున్నాడని తెలిసే వరకు మహా ప్రవక్త (స) ఆ విషయాన్ని మనస్సులోనే ఉంచుకునేవారు.

మరో కథనంలో హజ్రత్ అస్మా (రజి) ఇలా తెలియజేశారు. ఒక మహిళ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇలా విన్నవించుకుంది. ఓ ప్రవక్త! నాకు ఒక సవతి ఉంది. నా భర్త నాకు ఇవ్వని వస్తువులను కూడా ఆయన నాకు ఇచ్చినట్లుగా ఆమె ముందు గొప్పలు చెప్పుకోవడం పాపమా? (అంటే ఆమెను కేవలం ఇబ్బంది పెట్టడానికి లేదా అసూయ కలిగించడానికి నేనిలా చేయవచ్చా?) దానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సమాధానమిచ్చారు. తనకు లభించని దాని గురించి అబద్ధపు గొప్పలు చెప్పుకునే వ్యక్తి, అబద్ధం అనే రెండు వస్త్రాలను ధరించిన వానితో సమానం.

దీని వివరణలో ఇట్లు వ్రాయబడెను. ఇక్కడ 'వస్త్రాలు' అనే పదం ఒక ఉదాహరణగా వాడబడింది. ఆ వ్యక్తి పూర్తిగా అబద్ధం, మోసంతో నిండిపోయి ఉన్నాడని దీని అర్థం. అబద్ధం అనే ఒక వస్త్రాన్ని పైన కప్పుకొని, మరొకటి క్రింద కట్టుకున్నాడు.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించారు. ఎవనిలోనైతే ఈ నాలుగు

లక్షణాలుంటాయో అతను పూర్తిగా దాంబికుడు. ఒకవేళ ఎవనిలోనైనా వీటిలో ఏదైనా ఒక లక్షణమున్నను, అతను దానిని వదిలిపెట్టే వరకు అతనిలో కపటత్వపు ఒక లక్షణం ఉన్నట్లే. అతని వద్ద ఏదైనా సొత్తు ఉంచితే, అతను అందులో మోసం చేస్తాడు. అతను మాట్లాడితే అబద్ధం చెబుతాడు. అతను ఏదైనా వాగ్దానం చేస్తే, ఆ వాగ్దానాన్ని భంగం చేస్తాడు. అతను ఎవరితోనైనా గొడవపడితే, బూతులు మాట్లాడతాడు.

పైన పేర్కొన్న ఈ విషయాలన్నీ ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో మనిషిని అబద్ధం వైపునకే నడిపిస్తాయి లేదా అబద్ధాన్నే వ్యక్తపరుస్తాయి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంకా ఇట్లనిరి.

ఒక వ్యక్తి అబద్ధం చెప్పినప్పుడు, అతను చేసిన ఆ పని నుండి వెలువడే దుర్వాసన కారణంగా, అతనితో ఉండే దేవదూత అతనికి ఒక మైలు దూరం జరిగిపోతాడు.

ఒకసారి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ధాన్యపు రాశి వద్ద నుండి వెళ్తూ, తమ చేతిని ఆ ధాన్యం లోపలికి దూర్చారు. అప్పుడు వారి వేళ్లకు తడి తగిలింది. వారు ఆ ధాన్యపు యజమానిని పిలిచి, ఏమిటిది? లోపల తడిగా ఉంది? అని ప్రశ్నించారు. దానికి అతను ఓ అల్లాహ్ ప్రవక్త! వర్షం వల్ల అది తడిసిపోయిందని సమాధానమిచ్చాడు. అప్పుడు ప్రవక్త గారిలా అన్నారు: అయితే నువ్వు ఆ తడిసిన ధాన్యాన్ని పైభాగంలో ఎందుకు ఉంచలేదు? అప్పుడు ప్రజలు దానిని చూసి కొనేవారు కదా! గుర్తుంచుకో, ఎవరైతే మోసం చేస్తారో వారు నా అనుచరులు కారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ను విశ్వసించి, హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై నిజమైన విశ్వాసం కలిగి ఉన్నామని చెప్పుకునే మనం, మన ప్రతి మాటలో, పనిలో సత్యపు ఉన్నత ప్రమాణాలను కలిగి ఉండాలి. లేదంటే, ప్రవక్త గారు హెచ్చరించినట్లు "మీరు నా వారు కారు" అనే స్థితికి చేరుకుంటాము.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎల్లప్పుడూ సత్యాన్నే పలకడం నమ్మకం, నిజాయితీలో అందరికంటే గొప్పగా ఉండటం వల్ల ప్రజలందరిలో ఆయన సత్యవంతుడు, నమ్మకస్తుడని ప్రసిద్ధి చెందారు. ఈ విషయమై ఒక రచయిత ఇలా రాశారు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అజ్ఞాన కాలంలో ప్రవక్తగా నియమించబడ్డారు. అంతకుముందు ఆ జాతి వద్దకు ఏ ప్రవక్త రాలేదు. ఆ ప్రజలు విగ్రహాలను, బొమ్మలను, రాళ్ళు, రప్పలను పూజించేవారు. అటువంటి విగ్రహారాధకుల, సైతాను మార్గంలో ఉన్న వారి మధ్య నివసిస్తున్నప్పటికీ అల్లాహ్ వారికి బాల్యంలోనే అపారమైన వివేకాన్ని, జ్ఞానాన్ని ప్రసాదించాడు. ప్రవక్త గారెన్నడూ ఏ విగ్రహం వైపు మొగ్గు చూపలేదు, అలాగే ఆ ప్రజల విగ్రహారాధన సంబంధిత పండుగలలో గానీ, ఉత్సవాలలో గానీ ఎప్పుడూ పాల్గొనలేదు. వారెన్నడూ అబద్ధం చెప్పడం ఎవరూ వినలేదు. ప్రజలు వారిని అత్యంత సత్యవంతుడు, నమ్మకస్తుడు, సహనశీలి, పరమ దయామయుడిగా భావించేవారు. ఇస్లాం కంటే ముందు, అజ్ఞాన కాలంలో కూడా ప్రజలు తమ వివాదాల పరిష్కారం కోసం ఆయన వద్దకే వచ్చేవారని ఒక ఉల్లేఖనం గలదు.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఒక చోట ఈ విధంగా వివరించారు: "ప్రవక్త గారి ఉత్తమ నైతికతకు అతిపెద్ద సాక్ష్యం ఏమిటంటే, వారు ప్రవక్తగా ప్రకటించుకోక ముందే వారి జాతి ప్రజలు వారికి 'అమీన్' మరియు 'సిద్దీక్' అనే బిరుదులిచ్చారు. లోకంలో తమపై అవినీతి ముద్ర పడని వారు చాలా మంది ఉంటారు, అలాగే కఠినమైన పరీక్షలను ఎదుర్కొనని వారు కూడా ఎందరో ఉంటారు. వారు చిన్నపాటి పరీక్షల్లో నిజాయితీగా నిలబడవచ్చు, కానీ అంతమాత్రాన జాతి వారికి ప్రత్యేకమైన పేర్లను పెట్టదు. ఒక వ్యక్తి ఒక ప్రత్యేక గుణంలో ఇతరులందరికంటే ఎంతో గొప్పగా ఉన్నప్పుడే అటువంటి విశిష్ట నామాలు ఇవ్వబడతాయి. దీనిని ఆయన మరిన్ని ఉదాహరణలతో వివరించారు. యుద్ధంలో పాల్గొనే ప్రతి సైనికుడు తన ప్రాణాలను పణంగా పెడతాడు, కానీ ఆంగ్ల ప్రభుత్వం ప్రతి

సైనికుడికి 'విక్టోరియా క్రాస్' ఇవ్వదు. ఫ్రాన్స్‌లో లక్షలాది మంది విద్యావంతులు ఉండవచ్చు, కానీ ప్రతి ఒక్కరికీ 'లీజియన్ ఆఫ్ ఆనర్' లభించదు. కేవలం నమ్మకస్తుడిగా లేదా సత్యవంతుడిగా ఉండటం ఒక వ్యక్తి గొప్పతనాన్ని అంతగా చాటకపోవచ్చు, కానీ మొత్తం జాతి ఏకగ్రీవంగా ఒక వ్యక్తికి 'అమీన్' మరియు 'సిద్దీక్' అని బిరుదు ఇవ్వడమనేది అసాధారణమైన విషయం. వందల సం॥ల అరబ్ చరిత్రలో, ఒక జాతి మొత్తం ఏకగ్రీవంగా కేవలం ఒక్క వ్యక్తికి మాత్రమే 'అమీన్' మరియు 'సిద్దీక్' అనే బిరుదులు ఇవ్వడం దేనిని సూచిస్తుందంటే ఆయన సత్యం, నమ్మకత్వం ఎంతటి ఉన్నత స్థాయిలో ఉండేవో, అటువంటి ఉదాహరణ అరబ్బులకు మరెక్కడా కనిపించలేదని స్పష్టమవుతోంది. అరబ్బులు ఏ విషయాన్నైనా చాలా సూక్ష్మంగా పరిశీలించడంలో ప్రసిద్ధులు. అటువంటి వారు ఒకరిని 'అసాధారణమైన వ్యక్తి'గా గుర్తించారంటే అది ఖచ్చితంగా ప్రపంచంలోనే అరుదైన విషయంగా పరిగణించదగినది.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర జీవిత చరిత్రను వివరిస్తూ హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఒక చోట ఈ విధంగా వ్రాశారు: దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమకు దైవవాణి ప్రాప్తించిందని తన భార్యకు తెలిపినప్పుడు, ఆమె ఏమాత్రం సందేహించలేదు. ఇదేమిటి? కొత్తగా ఇలా చెబుతున్నారు? అని ఆమె అనలేదు. దానికి బదులుగా ఆమెంతో ధైర్యంగా ఇలా అన్నారు మీరు ఏమాత్రం ఆందోళన చెందకండి. మీరు చూసింది ముమ్మాటికీ నిజం. అల్లాహ్ మిమ్మల్ని ఎన్నడూ వృథా చెయ్యడు (నష్టపోనివ్వడు). ఎందుకంటే మీరు బంధుత్వాలను కలుపుతారు, అనాథల భారాన్ని మోస్తారు, అంతరించిపోతున్న నైతిక విలువలను పునరుద్ధరిస్తారు, అతిథులను గౌరవిస్తారు, సత్యానికి, హక్కుకు అండగా నిలుస్తారు. ఆ తర్వాత ఆమె తన సోదరుడైన వరకా బిన్ నౌఫల్ వద్దకు వారిని తీసుకువెళ్లారు. ఆయన పూర్వ గ్రంథాల జ్ఞానం కలిగిన పండితుడు. మీ అనుభవాన్ని విన్న వెంటనే ఆయనిలా అన్నారు: మూసా అలైహిస్సలాంనకు అల్లాహ్ ఎటువంటి ఆజ్ఞలను ఇచ్చాడో, అటువంటి అంశాలే ఈ దైవవాణిలోనూ కనిపిస్తున్నాయి. ఇంట్లోనున్న వారి చిన్నాన కుమారుడు,యవ్వనంలో ఉన్న ఆ యువకుడు మీ దంపతుల మాటలను విన్నప్పుడు, ఎంతో హుందాగా ముందుకు వచ్చి ఇలా అన్నాడు: "మీరు చెబుతున్నది సత్యమని నేను నమ్ముతున్నాను. నిశ్చయంగా అల్లాహ్ మీతో సంభాషించాడు మరియు ఈ ప్రపంచాన్ని సంస్కరించడానికి మిమ్మల్ని నియమించాడు. బానిసత్వం నుండి స్వాతంత్ర్యం పొందిన వ్యక్తి సాక్ష్యం: మీ నైతికతకు ముగ్ధుడై, తన తల్లిదండ్రులను సైతం వదిలి మీ దగ్గరే ఉండిపోయిన ఆయన, మీ ముఖంలో ఉన్న ఆలోచనను, గంభీరతను చూసి ఇలా అన్నారు: ఓ నా యజమాని! మీరు చూసిందే జరుగను. మీరు చూసింది, చెప్పింది సత్యం. నన్ను కూడా మీతోనే ఉంచుకోండి. ఇక్కడ మరొక గొప్ప సాక్ష్యముంది, అది ఒక ప్రాణ స్నేహితుని సాక్ష్యం. ఆయన ప్రవక్త వారితో కలిసి పెరిగిన మరో ఆణిముత్యం వంటివారు. తన స్నేహితుడు ఏదో కొత్త విషయాలు చెబుతున్నారని, బహుశా ఆయన మానసిక స్థితి సరిగ్గా లేదని ప్రజలు అనుకుంటున్నారని విన్నప్పుడు, ఆయన పరుగు పరుగున వచ్చి తలుపు తట్టి, నేను వింటున్నది నిజమేనా? అని అడిగారు. ప్రవక్త గారు దానిని ధృవీకరించినప్పుడు, ఆ స్నేహితుడు ఇలా అన్నారు: నా ప్రియ మిత్రమా! నేను మీ ప్రవక్తుత్వాన్ని విశ్వశిస్తున్నాను. కానీ దేవుని ప్రణాళిక చూడండి, ఆ వ్యతిరేకత మొదలవ్వక ముందే అల్లాహ్ వారికి అద్భుతమైన సహచరులను ప్రసాదించాడు.

భారాన్ని మోయడానికి మూసా (అ) ఒక మంత్రిని అడిగెను. కాని అడగకుండానే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు ఐదుగురు మంత్రులను అల్లాహ్ తఆలా ప్రసాదించాడు. ఆ మత్రులు ఆయన (స) భారాన్ని చాలా గొప్పగా మోశారు. వరకా బిన్ నౌఫల్ త్వరగానే మరణించినా,

చెరపలేని సత్య సాక్ష్యాన్ని ఇచ్చారు. హ్రజత్ ఖదీజా (రజి) 12 సం॥ల వరకు ఒక మహిళగా చూపిన ధైర్యం, ధీరత్వం ముందు గొప్ప గొప్ప వీరులు సైతం తలవంచుతారు. హ్రజత్ జైద్ (రజి) 20 సం॥ల వరకు సాటిలేని త్యాగాన్ని సమర్పించారు. చివరికి ఖడ్గాల నీడన తన రక్తాన్ని ధారపోసి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మంత్రి ఎలా ఉండాలో నిరూపించారు. హ్రజత్ అబూ బకర్, హ్రజత్ అలీ (రజి) ప్రవక్త (స) మరణం తర్వాత కూడా ఖలీఫాలుగా మారి ఆ మంత్రిత్వానికి కొత్త అర్థాన్ని ఇచ్చారు.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి: మన యజమాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం విశ్వసనీయతను చూడండి. వారు ప్రతి రకమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నారు, ఎన్నో కష్టాలను అనుభవించారు, కానీ సత్యం నుండి వెనక్కి తగ్గలేదు. వారి ఈ గట్టి సత్యత, విశ్వసనీయత కారణంగానే అల్లాహ్ వారిపై తన అపారమైన అనుగ్రహాన్ని కురిపించాడు. అందుకే అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆలో ఇలా ఆదేశించాడు:

اِنَّ اللّٰہَ وَمَلٰٓئِکَتَہٗ یُصَلُّوۡنَ عَلَی النَّبِیِّ ؕ یٰۤاَیُّہَا الَّذِیۡنَ اٰمَنُوۡا صَلُّوۡا عَلَیۡہِ وَسَلِّمُوۡا تَسۡلِیۡمًا

అనగా అల్లాహ్, అతని దేవ దూతలు కూడ నిశ్చయముగా ఈ సందేశ హరునిపై తమ అనుగ్రహమును అవతరింప జేయుచున్నాడు. కనుక ఓ విశ్వాసులారా! మీరు కూడ ఈ సందేశహరునికి 'దురూద్' పంపుచు వారి కొరకు శాంతిని యాచించు చుండుడు.

ఈ సూక్తి ద్వారా స్పష్టమయ్యేదేమనగా హ్రజత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పనులు, గుణగణాలు ఎంతటి మహోన్నతమైనవంటే వాటిని వర్ణించడానికి అల్లాహ్ ఎటువంటి పరిమితమైన పదాలను వాడలేదు. ఆయన చేసిన సత్కార్యాల గొప్పతనం హద్దులకు అతీతం. ఇటువంటి విశిష్టత మరే ఇతర ప్రవక్త విషయంలోనూ ప్రస్తావించబడలేదు. వారి ఆత్మలోని సత్యం, పవిత్రత, వారి పనులు దైవానికి ఎంతగా నచ్చాయంటే, రాబోయే తరాల వారు కృతజ్ఞతగా ఆయనపై ఎల్లప్పుడూ దురూద్ పంపాలని అల్లాహ్ శాశ్వత ఆజ్ఞను జారీ చేశాడు. ఆయన ధైర్యం, సత్యంనకు సాటిలేదు. మన పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జంతువుల కంటే హీనంగా బ్రతుకుతున్న వేలాది మంది మనుషులను సంస్కరించి ఉత్తమ మానవులుగా తీర్చిదిద్దారు. ఆనాడు కొందరు అనాథల సొత్తును అన్యాయంగా తినేవారు, మరికొందరు నక్షత్రాలను, ప్రకృతి శక్తులను ఆరాధించేవారు. అరేబియా ద్వీపకల్పం అప్పట్లో అనేక రకాల తప్పుడు నమ్మకాలకు నిలయంగా ఉండేది. అల్లాహ్ అపారమైన జ్ఞానం, ప్రణాళికతో, ప్రవక్త గారు అజ్ఞానం పరాకాష్టలో ఉన్న సమయంలో పంపబడ్డారు. తద్వారా పవిత్ర ఖుర్ఆన్ ప్రపంచం లోని ప్రతి తప్పుడు విశ్వాసాన్ని, చెడు ఆచారాన్ని ఖండించి, సరైన మార్గాన్ని చూపే పరిపూర్ణ గ్రంథంగా అవతరించింది. జంతువుల వంటి మనుషులను ఆయన నిజమైన మానవులుగా మార్చి చూపారు.

اللھم صل علی محمد وعلیٰ اٰل محمد وبارك وسلم انك حمید مجید

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా వారి సల్లల్లాహు అలైహి వసల్లం ఆదర్శాన్ని అనుసరిస్తూ, సత్యపు ప్రమాణాలను ఉన్నత శిఖరాలకు చేర్చుకొనుటకు మనందరిని అనుగ్రహించుగాక!

اَلۡحَمۡدُ لِلّٰہِ نَحۡمَدُہٗ وَنَسۡتَعِیۡنُہٗ وَنَسۡتَغۡفِرُہٗ وَنُؤۡمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیۡہِ۔ وَنَعُوۡذُ بِاللّٰہِ مِنۡ شُرُوۡرِ اَنۡفُسِنَا وَمِنۡ سَیِّئَاتِ اَعۡمَالِنَا۔ مَنۡ یَّھۡدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنۡ یُّضۡلِلۡہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشۡھَدُ اَنۡ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشۡھَدُ اَنَّ مُحَمَّدًا عَبۡدُہٗ وَرَسُوۡلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاۡمُرُ بِالۡعَدۡلِ وَالۡاِحۡسَانِ وَاِیۡتَآءِ ذِی الۡقُرۡبٰی وَیَنۡھٰی عَنِ الۡفَحۡشَآءِ وَالۡمُنۡکَرِ وَالۡبَغۡیِ۔ یَعِظُکُمۡ لَعَلَّکُمۡ تَذَکَّرُوۡنَ۔ اُذۡکُرُوا اللّٰہَ یَذۡکُرۡکُمۡ وَادۡعُوۡہُ یَسۡتَجِبۡ لَکُمۡ وَلَذِکۡرُ اللّٰہِ اَکۡبَرُ۔